బీజేపీ జేబు సంస్థగా ఈడీ

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- కేంద్రానికి తెలంగాణ ఉద్యమ తడాఖా చూపిస్తాం
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- ఎమ్మెల్సీ కవితక్క అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును ఖండిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో రాంనగర్ చౌరస్తాలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈడీ బీజేపీ నేతల చేతిలో కీలు బొమ్మగా మారి అక్రమ అరెస్టులు, బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతుందని కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వెంటనే విడుదల చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ బీజేపీ జేబు సంస్థగా మారిన ఈడీ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం నేత రాంబాబు యాదవ్, నాయకులు ముఠా జయసింహ, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కేంద్రానికి ఉద్యమ తడాఖా చూపిస్తం..

గోల్నాక : కేంద్ర ప్రభుత్వానికి మరో సారి తెలంగాణ ఉద్యమ తడాఖా చూపిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కవితక్క అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం..

కవాడిగూడ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మహాధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్, హైదరాబాద్ జిల్లా నాయకులు క్యాదాసి రాహుల్, బోటిక, మహేశ్, గాడ్స్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా మొజాంజాహి మార్కెట్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న అశీష్‌కుమార్ యాదవ్

మొజాంజాహి మార్కెట్ చౌరస్తాలో..

అబిడ్స్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్‌కు నిరసనగా మొజాంజాహి మార్కెట్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు అశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రియాగుప్తా, సునీల్ సాహు, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, వినోద్ యాదవ్, సంతోష్, రవి, కోటి శైలేష్ కురుమ, దశరథ్, అనిల్, సాయిబాబ పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కవితపై కేసులు..

చిక్కడపల్లి : కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేసిందని భారత ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. ఈ కేసుపై కార్మిక వర్గం నిరసన తెలుపాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కవితను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

నాయకులపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేయడం జాతీయ పార్టీలకు అలవాటుగా మారిందని బీఆర్ఎస్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. శనివారం చాంద్రాయణగుట్ట చౌరస్తాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును ఖండిస్తూ గులాబీ జెండాలతో ఆయన నిరసన వ్యక్తం చేశారు.

– చాంద్రాయణగుట్ట, మార్చి 16

ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ఆమె అరెస్టును ఖండిస్తున్నామని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు మంగి కిశోర్ కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ శనివారం జియాగూడ భగత్ సింగ్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. **– అబిడ్స్, మార్చి 16**

కవిత అరెస్టు అప్రజాస్వామికం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసును సుప్రీం కోర్టు ఈ నెల 19కి వాయిదా వేసినా ఈడీ, సుప్రీం కోర్టుకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా మహిళను రాత్రి వేళ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ స్టేట్ గ్రామ పంచాయితీ ట్రిబ్యూనల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కవాడిగూడలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో పక్కా రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు అని పేర్కొన్నారు.

– కవాడిగూడ, మార్చి 16

ఢిల్లీలో ధర్నా చేపడతాం

ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ త్వరలోనే ఢిల్లీలో ధర్నా చేపడ్తామని నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత మచ్చలేని నాయకురాలని కొనియాడారు. కవిత నిజాయితీని నిరూపించుకుని కడిగిన ముత్యంలా బయటకు వస్తుందని తెలిపారు. **– అబిడ్స్, మార్చి 16**

డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

కవాడిగూడలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

కవాడిగూడ, మార్చి 16: డ్రైనేజీ, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ దేవీప్రసాద్ బాగ్ వద్ద రూ. 13 లక్షలు, జ్యోతినగర్‌లో రూ. 20 లక్షలు, గంగానగర్‌లో రూ. 34 లక్షలు, బండమైసమ్మనగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ గోడ్సల రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, డీజీఎం కార్తిక్ రెడ్డి, సెక్షన్ మేనేజర్ శ్రీధర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, గొల్లగడ్డ రాజశేఖర్ గౌడ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, రమణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేశ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగులకు న్యాయం చేయాలి..

ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న తెలంగాణ మాజీ సైనికోద్యోగులు

కవాడిగూడ, మార్చి 16: దేశ సేవలో 17 నుంచి 20 ఏండ్ల తరువాత పదవీవిరమణ పొందిన మాజీ సైనికులకు తెలంగాణ రాష్ట్రం ఉద్యోగాలతో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ మాజీ సైనిక ఉద్యోగులు ఆరోపించారు. మాజీ సైనిక ఉద్యోగుల గ్రూప్-4 ఉద్యోగాలపై మరణ శాసనంగా జీఓ నంబర్ 55ను వెంటనే సవరించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో టీఎస్‌పీఎస్‌సీ ఉద్యోగాలలో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ మాజీ సైనిక ఉద్యోగులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ సైనికోద్యోగులు సురేందర్‌రెడ్డి, రవికుమార్, శుషుకుమార్, మల్లారెడ్డి, ఆంజనేయులు, నరేందర్, బి. సంజీవ్‌కుమార్, వేణుగోపాల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుజిత్‌లు తదితరులు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 317 అండ్ 46 బాధితుల లాగా జీఓ 55 బాధితులు మాజీ సైనికులను చర్చలకు ఆహ్వానించి పరిష్కరించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

లడ్డాఖ్, హిమాలయ ప్రదేశాలలో 370 ఆర్టికల్ రద్దయిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా మైనింగ్‌లకు అనుమతులు ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నారని టీమ్ ఫర్ ది నీటి, ధ్రువాస్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు దీక్షను చేపట్టారు. పలు సంస్థల ప్రతినిధులు వినయ్ వంగల, మధులత, శ్రీనివాస్, రాకేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి లడ్డాఖ్, హిమాలయ ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. **– కవాడిగూడ**

డప్పు రమేశ్ ద్వితీయ సంస్మరణ

చిక్కడపల్లి, మార్చి16 : ప్రజా నాట్య మండలి సాంస్కృతిక డప్పు రమేశ్ ద్వితీయ సంస్మరణ సందర్భంగా శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఫాసిజాన్ని ఓడిద్దాం ప్రజా కళలు, సంస్కృతిని కాపాడుకుందాం' అనే పేరట సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినిమా డైరెక్టర్ జి. నర్సింగరావు, ప్రొఫెసర్ కాశీం, రచయిత అనురాధ హాజరయ్యారు. రచయిత భూపాల్, సంధ్య, రాజనర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థి దశ అమూల్యమైంది

విద్యార్థి జీవితం అమూల్యమైందని వైశ్యహాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుడుగుంట్ల ధనంజయ్ అన్నారు. వైశ్యహాస్టల్ ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో కాచిగూడ వైశ్యహాస్టల్‌లో విద్యార్థుల కోసం నిర్మించిన నూతన డీలక్స్ గదులను శనివారం రాత్రి చైర్మన్ ధనంజయ్, సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.నగేశ్, కోశాధికారి కె.రఘువీర్, ఉప్పల రాజేశ్వర్, రవిప్రసన్న కుమార్, రాజేశ్వర్‌రావు, భాస్కర్‌గుప్త, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. **– కాచిగూడ, మార్చి 16**

అద్దెలు చెల్లించే వరకు పాఠశాలలకు తాళం

రవీంద్రభారతి,మార్చి 16: మూడు సంవత్సరాలుగా ప్రాథమిక, హైస్కూళ్లకు ప్రభుత్వం చెల్లించవలసిన అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని రెసిడెంటెడ్ బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ అతీఫ్, నాయకులు అఫీష్ ఖాన్,మహ్మద్ వహీద్, జయదీర్ తదితరులు పాల్గొని మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా అద్దెలు చెల్లించనందుకు ఈ రోజు పాఠశాలల అన్నింటికి తాళం వేయడం జరిగిందని చెప్పారు. జంటనగరాలలో 110 స్కూల్స్ ఉన్నాయని వీటికి ప్రభుత్వం అద్దెలు చెల్లించలేదని ఈ విషయాలపై ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నందకిశోర్ వ్యాస్

గోషామహల్ నియోజకవర్గం నాయకులు నందకిశోర్ వ్యాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రోహిన్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌యాదవ్, శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు. **– అబిడ్స్, మార్చి 16**

డబుల్‌బెడ్‌రూం ఇండ్ల మంజూరు అనంతరం ఇండ్లలో సౌకర్యాలు కల్పిస్తామని కొందరు దళారులు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ సీపీఎం చాంద్రాయణగుట్ట సీనియర్ నాయకుడు కృష్ణ ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

– చాంద్రాయణగుట్ట, మార్చి 16

విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మల సంక్షేమానికి వెయ్యికోట్లు కేటాయించాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. వెయ్యికోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మధన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచార్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్బోజు భిక్షపతి, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు. **– రవీంద్రభారతి,మార్చి16**

సరోజినీదేవిలో.. ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



మనిషిలో కంటి చూపు సమస్యలలో వచ్చే గ్లకోమా వ్యాధిని నివారించడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెహిదీపట్నం సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం అన్నారు. మెహిదీపట్నం సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించిన గ్లకోమా వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం మాట్లాడుతూ.. గ్లకోమా వ్యాధిని గుర్తించడానికి కంటి చూపు పరీక్షలను ఎప్పటికప్పుడూ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరత్నం, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు. **– మెహిదీపట్నం మార్చి 16**

నీటి సమస్యలు లేకుండా చూడండి..

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంచినీటి సమస్యలు లేకుండా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా జల మండలి అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం జలమండలి మేనేజర్ సాజిద్‌కు డాక్టర్ శ్రీనివాస్‌రావు లతో కలిసి ఆయన వినతిపత్రం ఇచ్చారు. **– మెహిదీపట్నం, మార్చి 16**

ఇద్దరి పిల్లలతో మహిళ అదృశ్యం

ఓర మీనాక్షి

కవాడిగూడ, మార్చి 16: తన ఇద్దరి పిల్లలతో సహా మహిళ అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గుండెపూడి గ్రామానికి చెందిన ఓర మహేశ్ అనే వ్యక్తికి 2016లో మీనాక్షి అనే మహిళతో వివాహం జరిగింది. వీరు హిమాయత్‌నగర్‌లో ఉంటున్నారు. అయితే ఈ నెల 7న మహేష్ తన భార్యతో మీనాక్షిల మధ్య చిన్న గొడవ జరిగింది. మీనాక్షి భర్త తన వ్యక్తిగత పనిమీద వరంగల్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇద్దరు పిల్లలతో భార్య కనిపించకుండా పోయిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 16 : గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో తీవ్రగాయాలతో దవఖానలో చికిత్సపొందుతున్నాడు. నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎ. శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. నెక్లెస్ రోడ్డు-హుస్సేన్ సాగర్ జంక్షన్‌ల మధ్య శనివారం 30సంవత్సరాల గుర్తు తెలియని ఓ వ్యక్తి పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉస్మానియా దవఖానలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బ్లూ కలర్ టీషర్టు, జీన్ ప్యాంటు ధరించినట్లు ఆయన వెల్లడించారు. వివరాలకు 040-23202238, 871256 8449 నంబర్లలో సంప్రదించాలి.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్‌లో కొత్తగా వేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ బి. పద్మ శనివారం పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకట రెడ్డి, జె.బాల్‌రాజు, మిర్యాల శ్రీనివాస్, శ్రీహరి, మహేందర్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. **– అంబర్‌పేట, మార్చి 16**

మోదీ, అమిత్‌షా ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

సీఏఏ అమలుకు చర్యలు తీసుకున్న భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాల ఫ్లెక్సీలకు బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పుత్లిబౌలి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పాల్గొని ప్రధాని ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. నాయకులు మహేందర్, రామకృష్ణ, రాజు యాదవ్, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **– అబిడ్స్, మార్చి 16**

పార్టీ విజయానికి పాటు పడాలి..

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన పార్టీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతతో కలిసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి హైదరాబాద్‌లో బీజేపీ విజయం సాధించేందుకు పాటు పడాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వి. పాండు యాదవ్, సుందర్‌రెడ్డి, లోక్‌సభ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సుభాష్ చందర్‌జీ తదితరులు పాల్గొన్నారు. **– అబిడ్స్, మార్చి 16**

ఎన్నికల పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరించాలి

చిక్కడపల్లి, మార్చి 16 :దేశంలో ఎన్నికలకు సంబంధించిన పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరించాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నా రు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛయుత, నిష్పాక్షిక ఎన్నికలు- ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ పారదర్శకత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సదస్సులో రాజ్యంగ హక్కుల వేదిక నాయకులు కే వేణుగోపాల్, ఐలు గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్ ల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గంలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏ, బీ బ్లాక్‌ల అధ్యక్షులు కూరాకుల కృష్ణ, కె.చంటిబాబులతో పాటు నాయకులు రఘుపాల్‌రెడ్డి, నర్సింహగౌడ్ పాల్గొన్నారు. **– మెహిదీపట్నం మార్చి 16**

కార్మిక శాఖ కార్యాలయంలో శిథిల భవనం కూల్చివేత

చిక్కడపల్లి, మార్చి 16 : ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కమిషర్ కార్యాలయం అవరణలో శిథిల భవనాన్ని కూల్చివేశారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిన ఈ భవనాన్ని రెండు రోజుల్లో పూర్తిగా కూల్చివేశారు. కాగా1995 లో కార్మిక శాఖ కమిషనరేట్ ఏర్పాటు అయిన తర్వాత కూడా కార్మికశాఖ కార్యాలయంగా భవనాన్ని ఉపయోగించారు. కార్మిక శాఖ కార్యాలయం అభివృద్ధిలో భాగంగానే శిథిలంగా మారిన భవనాన్ని కూల్చివేశారు.

ఇష్టారాజ్యంగా తవ్వకాలు తెగిపోయిన కేబుల్ వైర్లు

అంబర్‌పేట, మార్చి 16 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంట మల్లేశ్‌యాదవ్ కిరాణా షాపు గల్లీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిమిత్తం రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వడంతో కేబుల్‌వైర్లు మొత్తం తెగిపోయాయని స్థానికులు వాపోయారు. వైర్లు తెగడంతో అండర్ గ్రౌండ్‌లో ఉన్న కరెంటు వైర్లు తెగి కరెంటు రివర్స్ రావడంతో ఇండ్లల్లో ఉన్న ఫ్రిడ్జ్‌లు పాడైపోయాయని చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగితే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జలమండలి అధికారులు పట్టించుకోవాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడండి

అంబర్‌పేట, మార్చి 16 : పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా సూపర్‌వైజర్లు సరైన పర్యవేక్షణ చేయాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతి దివాకర్ అన్నారు. సర్కిల్ పరిధిలోని శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్, ఎస్‌డబ్లుజీలతో ఏఎంఓహెచ్ హేమలతతో కలిసి కాచిగూడలోని వార్డు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.

అలరించిన సంగీత విభావరి

శ్రీమతి ప్రత్తి మణెమ్మ అండ్ శేషయ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురినీ విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లెపూల వెంకటరమణ, చల్లా కేశవ్‌చంద్, నాగేందర్, గొర్తి చంద్రశేఖర్, కమల శాస్త్రి, సంస్థల నిర్వాహకురాలు చల్లా సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావును సత్కరించారు. **– ముషీరాబాద్, మార్చి 16**

అన్నదానం

అంబర్‌పేట, మార్చి 16 : సేవాభావంతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని మాజీ కార్పొరేటర్ నేమూరి సాంబశివగౌడ్ అన్నారు. సంఘ సేవకురాలు నేమూరి లక్ష్మమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా శివం రోడ్డులో గల బాగ్ అంబర్‌పేట శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం వద్ద శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేమూరి చంద్రకళ, అవినాష్‌గౌడ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబా